అడుగడుగునా అవరోధం

- సొంతింటి కలకు మోకాలడ్డు
- ఎస్‌హెచ్‌జీ సొమ్ము విడుదలపై డైలమా
- కాంట్రాక్టర్లకు ముందు నుయ్యి, వెనుక గొయ్యి





కొమరగిరి లేఅవుట్‌లో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు

కాకినాడ: పేదల సొంతింటి కల సాకారానికి అడుగడుగునా అవరోధం కలుగుతోంది. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మిస్తోన్న గృహనిర్మాణాలకు గ్రహణం పట్టే పరిస్థితి కనిపిస్తోంది. గృహనిర్మాణాలను వేగవంతం చేసి పేదల సొంతింటి కల సాకారం చేయాలన్న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యానికి ప్రస్తుత ప్రభుత్వం, అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ఫలితంగా పీఎంఏవై పథకంలో మంజూరైన ఇళ్లు 2025 మార్చి చివరి నాటికి పూర్తికాకపోతే నిధులన్నీ వెనక్కి పోయే ప్రమాదం పొంచి ఉంది. వివరాల్లోకి వెళ్తే జిల్లా కేంద్రం కాకినాడలోని సుమారు 16వేల మంది లబ్ధిదారుల కోసం కొమరగిరి లేఅవుట్‌లో 350 ఎకరాలు సేకరించారు. ఇందులో సుమారు పది వేల మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. ప్రధానంగా అప్పటి ప్రభుత్వం కల్పించిన ఆప్షన్‌-3 పథకాన్ని ఎంచుకుని ప్రభుత్వం ద్వారా లేబర్ ఏజెన్సీ నిర్మాణం చేపట్టే విధానాన్ని లబ్ధిదారులంతా ఎంచుకున్నారు. అయితే ఆర్థిక పరిస్థితుల వల్ల ఇళ్ల నిర్మాణం మందగించకుండా ఉండేందుకు గత ప్రభుత్వం లబ్ధిదారులుగా ఉన్న స్వయం సహాయక సంఘాల్లో ఉన్న వారికి రూ.35వేలు చొప్పున టౌన్‌లెవెల్ ఫెడరేషన్ ద్వారా రుణాన్ని సమకూర్చింది. దీంతో బేస్‌మెంట్‌స్థాయిలో ఇళ్ల నిర్మాణానికి ఎస్‌హెచ్‌జీలకు వచ్చిన రూ.35వేలు సొమ్మును కాంట్రాక్టర్లకు ఇచ్చి వాటి ద్వారా నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయడంతో సుమారు 9వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.

గృహనిర్మాణాలు వేగవంతం చేస్తాం...

కొమరగిరితోపాటు ఇతర లేఅవుట్లలో గృహ నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వర్షాలు కారణంగా ప్రస్తుతం పనులు వేగంగా జరగడంలేదు. ఎస్‌హెచ్‌జీల సొమ్ము విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. 2025 మార్చి నాటికి గృహనిర్మాణాలు పూర్తిచేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేసి చైతన్యం కలిగిస్తున్నాం.

– కె.ఎస్.ఎన్.రెడ్డి, డీఈ, హౌసింగ్

కార్పొరేషన్‌లో స్తంభించిన నిధులు

స్వయం సహాయక సంఘాల సభ్యులకు విడుదలైన రుణాన్ని కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా ప్రస్తుతం నిలిపివేశారు. దాదాపు రూ.4 కోట్ల వరకూ ఎస్‌హెచ్‌జీ రుణాల రూపంలో సేకరించిన సొమ్ము ప్రస్తుతం మెప్మా విభాగం వద్ద గాలిలో ఉండిపోయింది. ముందుగా లబ్ధిదారుల నుంచి రావాల్సిన వాటా సొమ్ముతో ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించి చివరిలో మాత్రమే ఈ 35 వేలు వినియోగించాలన్న ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలు ఇందుకు కారణమయ్యాయి. రుణం రూపంలో వచ్చిన సొమ్ము ఉన్నప్పటికీ ఇళ్ల నిర్మాణ ప్రగతి కనిపించని కారణంగా తమ వాటా సొమ్ము ఇచ్చేందుకు లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. మరో వైపు సొమ్ములు వస్తాయన్న ఆశతో లేబర్ ఏజెన్సీలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టి బేస్‌మెంట్‌తో పాటు వివిధ దశల్లో పూర్తి చేసిన ఇళ్లు ఇప్పుడు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

ఎస్‌హెచ్‌జీ సొమ్ము విడుదలైతేనే...

మెప్మాలో ఉన్న ఎస్‌హెచ్‌జీ సొమ్మును సంబంధిత కాంట్రాక్టర్లకు చెల్లిస్తేనే గృహనిర్మాణాలు వేగవంతం అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇళ్ల నిర్మాణం మొదలు పెడితే రూ.1.50 లక్షల కేంద్ర వాటా, రూ.30 వేలు రాష్ట్ర ప్రభుత్వ వాట విడుదలై పనులు వేగవంతమయ్యే అవకాశం ఉంటుందంటున్నారు. సముద్ర తీరం కావడంతో ఇక్కడ నిర్మాణ వ్యయం కూడా మిగిలిన ప్రాంతాలకంటే రూ.3.60లక్షలు ఉంటుందన్న అంచనా ఉన్న నేపథ్యంలో కొంత ప్రగతి కనిపిస్తే తప్ప లబ్ధిదారులు తమ వాటా సొమ్ము చెల్లించే పరిస్థితి కనిపించడంలేదు.

నిధులు వెనక్కి..

జిల్లా కేంద్రానికి ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన పథకంలో మంజూరైన ఇళ్లను 2025 మార్చి చివరి నాటికి పూర్తి చేయాల్సి ఉంది. అలా నిర్మాణం పూర్తికాకపోతే విడుదలైన నిధులు వెనక్కిపోయే ప్రమాదం ఉంది. దీనిపై కలెక్టర్, నగరపాలక సంస్థ, హౌసింగ్, మెప్మా అధికారులు చొరవ తీసుకుని సంయుక్త సమావేశాలు ద్వారా గృహనిర్మాణాలను వేగవంతం చేయాల్సిన పరిస్థితి ఉంది. అలా జరిగితేనే మంజూరైన ఇళ్లు వెనక్కి వెళ్లకుండా లబ్ధిదారుల సొంతింటికల సాకారమయ్యే పరిస్థితిని కనిపిస్తోంది. సొమ్ములు వస్తాయనే ఆశతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు కూడా ఎస్‌హెచ్‌జీతోపాటు ఇతర నిధులు కూడా విడుదల కాక ముందు నుయ్యి, వెనక గొయ్యి అన్న చందాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రారంభించిన పనులు పూర్తికాకపోతే అసలుకే మోసం వస్తుందనే భయంతో ముందుకు వెళ్ళలేక, వెనక్కి తగ్గలేక తలలు పట్టుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పేదల సొంతింటికల దూరం కాకుండా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

17 నుంచి స్వచ్ఛతా సేవా కార్యక్రమాలు

కాకినాడ సిటీ: జిల్లాలో ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు స్వచ్ఛతా హై సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ సగిలి శనివారం సా యంత్రం తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఈనెల 17 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకూ స్వచ్ఛతా హై సేవా కార్యక్రమాలు జరుగుతాయని రెండున స్వచ్ఛ భారత్ దివాస్‌గా జరుపుకొంటామని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛతా సేవా కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో మూడు రకాల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 17న ప్రారంభోత్సవం, 18 నుంచి అక్టోబర్ ఒకటి వరకూ మొక్కలు నాటడం, మెప్మా, డ్వాక్రా, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్థానిక స్వచ్ఛతా కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు, విద్యుత్, నీటి ఆదా, ప్లాస్టిక్ నిషేధం, తాగునీటి క్లోరినేషన్, ఆరోగ్యకరమైన జీవితం తదితర అంశాలపై అవగాహన ఉంటుందన్నారు. సాంస్కృతిక కార్యక్రామలు, పార్కుల్లో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయడం, సాలిడ్ వేస్ట్ భవనాలకు పెయింటింగ్ చేయడం, అన్ని విద్యాసంస్థల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించడం, వార్డుల్లో పోటీలు, ర్యాలీలు, మానవహారం నిర్వహించడం తదితర కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గ్రామాల్లో సంపూర్ణ స్వచ్ఛతా, పారిశుధ్యం మెరుగు, పార్కుల, డ్రైనేజ్, రహదారుల, విద్యా సంస్థల, వాణిజ్య సముదాయాల క్లినింగ్, పబ్లిక్ స్థలాల్లో సుందరీకరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. బాలల సురక్షా కార్యక్రమాలు, వాక్సినేషన్ డ్రైవ్, పోషకాహార పంపిణీ, హెల్త్ ఇన్సూరెన్స్ నమోదుకు సహకారం, స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపు వంటి కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారన్నారు. రెండున స్వచ్ఛభారత్ దివాస్ ఉత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయని కలెక్టర్ షణ్మోహన్ వివరించారు.

దేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు

కాకినాడ సిటీ: భారత దేశం గర్వించదగ్గ గొప్ప నేత సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు కొనియాడారు. సీతారాం ఏచూరి సంస్మరణ సభ శనివారం సాయంత్రం కాకినాడ సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీతారాం ఏచేరి మృతికి కొంతసేపు మౌనం పాటించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారాం ఏచూరి మార్క్సిస్టు మేధావి అని కొనియాడారు. ఏచేరి నిగర్విగా ఉండేవారని, పలు భాషల్లో ప్రావీణ్యం పొందిన వ్యక్తి అన్నారు. ఏచూరి మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు పలివెల వీరబాబు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, జి.బేబీ రాణి, సీపీఐ నాయకుడు కె. బోడకొండ, లిబరేషన్ నాయకులు, న్యూడెమొక్రసీ, ఫార్వార్డ్ బ్లాక్, కాంగ్రెస్ పార్టీ, టీడీపీ, ఆర్పీ, యూటీఎఫ్ నాయకులు, తోలుబొమ్మ కళాకారుల సంఘం నాయకులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, సామాజికవేత్తలు పాల్గొన్నారు.

ఇంజినీర్‌గా ఎదగడానికి విశ్లేషణాత్మక ఆలోచన ముఖ్యం

- ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు(కాకినాడ): ఇంజినీర్‌గా ఉన్నతంగా ఎదగడానికి విశ్లేషణాత్మక ఆలోచన, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్యలను పరిష్కరించడంలో నైపుణ్యం, సమష్టి కృషి వంటి అంశాలు ముఖ్యమని ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక జేఎన్‌టీయుకే ప్రాంగణంలో శనివారం అలూమ్ని ఆడిటోరియంలో ఐఐఐటీ డైరెక్టరేట్, పైడా గ్రూప్ ఆఫ్ కాలేజీస్ సంయుక్త ఆధ్వర్యంలో 'బేసిక్ ఇంజినీరింగ్ స్కిల్స్' అనే అంశంపై విద్యార్థులకు ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరు కాగా, విశిష్ట అతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అతిథులుగా ఖతార్‌లోని ఓరియక్స్‌టెల్ కంపెనీ సీనియర్ ప్రొడక్షన్‌ఎగ్జిక్యూటివ్ విజ్ఞేశ్వరంలోని రెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రేఖపల్లి శ్రీనివాస్, పైడా విద్యాసంస్థల సెక్రటరీ పైడా సత్య శ్రీరామ్‌లు పాల్గొన్నారు. ఐఐఐటీ డైరెక్టర్ బి.టి.కృష్ణ కన్వీనర్‌గా, పైడా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆర్డీ డైరెక్టర్ డా.పి.వంశీ కృష్ణ రాజా కో కన్వీనర్‌గా వ్యవహరించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ తమ కలలను సాకారం చేసుకుని బంగారు భవిష్యత్తుగా రూపుదిద్దుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపకరిస్తుందన్నారు. భవిష్యత్తులో యువ శాస్త్రవేత్తలుగా, ఇంజినీర్లుగా సమాజానికి ఉపయోగపడే శక్తిగా తయారవ్వాలని సూచించారు. ఐఐఐటీ డైరెక్టర్ కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను జేఎన్‌టీయూకే అనుబంధ కళాశాలల్లో నిర్వహించడంలో భాగంగా నేడు పైడా విద్యాసంస్థల విద్యార్థులకు బేసిక్ ఇంజిజనీరింగ్ స్కిల్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించామన్నారు. అనంతరం అతిథులు విద్యార్థులకు ఇంజినీరింగ్ స్కిల్స్‌పై పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, పైడా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డిప్యూటీ డైరెక్టర్ కె.రవీంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్య ప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన

- రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహణ
- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి సూచన



రిలయన్స్ పోషణ్ కిట్లు అందుకున్న బాలికలు, చిత్రంలో డాక్టర్ లావణ్యకుమారి, రమేష్

కాకినాడ క్రైం: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో స్వేచ్ఛ పేరిటతో నిర్వహిస్తున్న సామాజిక సేవలో భాగంగా శనివారం కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, జీజీహెచ్ సూపరింటెండెంట్, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ డి.లావణ్యకుమారి హాజరయ్యారు. గాడిమొగ, భైరవపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థునులకు వారి ఆరోగ్యంపై డాక్టర్ లావణ్యకుమారి అవగాహన కల్పించారు. రమేష్ మాట్లాడుతూ, కిశోర బాలికల ఆరోగ్య భద్రత కోసం రిలయన్స్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా పోషకాహారంతో కూడిన రిలయన్స్ పోషణ్ కిట్లను విద్యార్థినులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కిశోర బాలికల ఆరోగ్యంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు, రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి కె.స్వాతిదేవి, పి.సుబ్రహ్మణ్యం, పి.వెంకటరావు, బిష్ణుదాస్ పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సతీష్‌కు మంత్రి అభినందన



సతీష్‌ను సత్కరించి డాక్టరేట్‌ను అందజేస్తున్న మంత్రి సుభాష్

కాకినాడ క్రైం: సేవా మార్గంలో పయనిస్తూ ఆదర్శవంతంగా నిలుస్తున్న శ్రీ యువసేన వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌కు డాక్టరేట్ వరించడంపై మంత్రి వాసంశెట్టి సుభాష్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం కాకినాడ నగరానికి వచ్చిన ఆయన స్థానిక గ్లాస్ హౌస్ సెంటర్‌లో ఉన్న శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లారు. డాక్టరేట్ అందుకున్న సతీష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సతీష్ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సతీష్‌ను సత్కరించారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కిరణ్

బోట్‌క్లబ్: ప్రథమ చికిత్సపై అవగాహన అత్యంత అవసరమని ప్రముఖ వైద్యులు చిట్ల కిరణ్ అన్నారు. స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాలలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ప్రథమ చికిత్స ఎలా చేయాలి, స్పృహ కోల్పోయిన వ్యక్తికి సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ప్రజలకు క్లిష్టమైన సమయాలలో ప్రాణాలను రక్షించే నైపుణ్యాలను నేర్పడానికి ప్రపంచ వ్యాప్తంగా సీపీఆర్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించడం, భద్రత కల్పించడంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి వైద్యులందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు నాగేంద్ర, సిరాజ్, పద్మావతి, భవానీ విద్యార్థులు పాల్గొన్నారు.

రమణయ్యపేటలో ...

కాకినాడ రూరల్: ప్రపంచ ప్రాథమిక చికిత్స దినోత్సవం పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వైద్యుడు అడ్డాల సత్యనారాయణ ప్రాథమిక చికిత్స గురించి అవగాహన కల్పించారు. హార్ట్ ఎటాక్ వస్తే వెంటనే చేపట్టిన ప్రాథమిక చికిత్స, ప్రమాదాలు జరిగినప్పుడు అందించాల్సిన అత్యవసర ప్రథమ చికిత్సను వివరించారు కార్యక్రమంలో డాక్టరు సువర్ణరాజు, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పిల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూపాయికి బిర్యాని



రూపాయి బిర్యానీ కోసం బారులు తీరిన యువత, మహిళలు



తెచ్చుకున్న రూపాయి నోట్లతో యువకులు

కాకినాడ క్రైం: కాకినాడ భానుగుడిలో రొయ్యలనాయుడు రెస్టారెంట్ రూపాయి నోటుకి బిర్యానీ విక్రయిస్తోంది. దీంతో వందలాది మంది ఎగబడుతున్నారు. వీరిలో యువతే ఎక్కువ మంది ఉండగా, మహిళల క్యూ చూస్తే దిమ్మతిరిగింది. అయితే కేవలం రూపాయి నాణేనికి కాదు, నోటుకే ఈ బిర్యానీ లభిస్తుంది. ఫుల్ బిర్యానితో పాటు నాలుగు రకాల నాన్ వెజ్ కర్రీస్‌తో ప్యాక్ అదరగొడుతున్నారని బిర్యానీ కోసం పడిగాపులు కాస్తున్న యువత అంటున్నారు. గడచిన మూడు రోజులుగా రూపాయి నోటుకి బిర్యానీ విక్రయిస్తుండగా ప్రతి రోజు వెయ్యి మంది ఈ బిర్యానీ కొంటున్నారు. శనివారంతో ఈ బంపర్ ఆఫర్ ముగియనుందని సమాచారం. ఇక్కడి ట్రాఫిక్‌ని నియంత్రించడానికి ప్రత్యేకంగా ముగ్గురు ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండడం విశేషం.

ఖాదీ బోర్డు స్థలాన్ని కాపాడండి

కాకినాడ సిటీ: ఒకప్పుడు ఎంతో మందికి ఉపాధి కల్పించిన జిల్లా ఖాదీ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థకు చెందిన తూరంగిలోని భూములను కబ్జా కాకుండా కాపాడాలని స్థానిక నాయకులు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఖాదీ బోర్డు స్థలం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు, స్థానిక నాయకులు బొబ్బిలి గోవిందు, జక్కి అప్పన్న, గురి గణేష్ మాట్లాడుతూ తూరంగిలోని ఖాదీ రూరల్ డవలప్‌మెంట్ సంస్థకు చెందిన 1.69 ఎకరాల భూమి ఉందని, ఈ స్థలం ఇప్పుడు ఉన్న మార్కెట్ రేటు ప్రకారం దాదాపు రూ.20 కోట్లు పైనే ఉంటుందన్నారు. ఈ స్థలాన్ని కొందరు వ్యక్తులు అమ్మేయాలని ప్రయత్నిస్తున్నారని, ఈ స్థలాన్ని ప్రభుత్వం కాపాడాలని కోరారు. ఈ భూములను అమ్మాలంటే సెంట్రల్ ఖాదీ కమిషన్ అనుమతి ఉండాలని, వారి అనుమతి లేనిదే కొనుగోలు చేయడానికి గాని, అమ్మడానికి గాని ఎవరికీ హక్కులేదన్నారు. తూరంగిలో ఉన్న జనసేనకు చెందిన నాయకుడు ఈ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి అమ్మేయాలని చూస్తున్నారని, స్థలానికి సంబంధించి దొంగ పత్రాలను సృష్టించారని ఫణీశ్వరరావు, గోవిందు, అప్పన్న వివరించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించి, సరైన నిర్ణయం తీసుకునేలా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రసాద్ శర్మ, బొజ్జా సాంబశివరావు, దేవరాజ్, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు అదే ఆదరణ



జమ్మలమడక నాగమణి

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేత జమ్మలమడక

కాకినాడ రూరల్: ఏలేరు వరద ప్రాంతాల్లో పర్యటించేందుకు కాకినాడ జిల్లాకు వచ్చిన వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌పై ప్రజల్లో ఆదరణ తగ్గలేదని, గతంలో మాదిరిగా అదే అభిమానం చూపించారని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ కో ఆర్డినేటరు జమ్మల మడక నాగమణి పేర్కొన్నారు. కాకినాడ 49వ డివిజన్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, పిఠాపురం నియోజకవర్గంలో జగన్ పర్యటన విజయవంతమైందన్నారు. ఏలేరు వరదకు రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం క్రాప్ ఇన్సురెన్స్ చెల్లించకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా గోదావరి జిల్లాలో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు ఇన్సురెన్స్ పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఏలేరు ఆధునికీకరణ చేపట్టాలన్నారు.

తప్పిపోయిన బాలుడు కాకినాడ రాక



విద్యార్థితో రైల్వే ఎస్సై, కానిస్టేబుల్

సామర్లకోట: తిరుపతి జిల్లా నుంచి ఒక విద్యార్థి ఇంటి నుంచి వచ్చి కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. సామర్లకోట రైల్వే పోలీసులు శనివారం మూడో నంబరు ప్లాట్‌ఫాంపై అనుమానాస్పద స్థితిలో ఉన్న ఒక విద్యార్థిని గుర్తించారు. అతడిని ప్రశ్నించగా తాను తప్పిపోయి వచ్చానని, తన పేరు షేక్ మస్తాన్ అని, తిరుపతి జిల్లా, వెంకటగిరి మండలం, మూసాపేట అని, 9వ తరగతి చదువుతున్నట్లు తెలిపాడు. దాంతో ఆ విద్యార్థిని రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చి వెంకటగిరి పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అప్పటికే అతడు కనిపించడం లేదని తల్లిదండ్రులు షబిహా, జమీల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చిన్నట్లు తెలుసుకుని వారికి రైల్వే ఎస్సై బి.లోవరాజు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు వచ్చిన తరువాత విద్యార్థిని అప్పగిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

పేదల ఆకలి తీరుస్తున్న సేవా సంఘం



నిరుపేదలకు అన్నదానం చేస్తున్న తలాటం హరీష్

బోట్‌క్లబ్: అన్నం కోసం ఎవరూ ఇబ్బంది పడకూడదని డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవా సంఘం ఏర్పాటు చేసి ప్రతి శనివారం అన్నదానం చేస్తున్నామని ఆ సంఘ చైర్మన్ తలాటం హరీష్ అన్నారు. స్థానిక మునిసబుగారి వీధిలో శనివారం హరిప్రభు, తన్మయి దంపతులు సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. ప్రతి వారం దాతలు సహకారంతో నాణ్యమైన ఆహారం పేదలకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రామ్‌కుమార్, సురేష్, కోటేశ్వరరావు, శ్రీను, మణికంఠ పాల్గొన్నారు.

గణపతి పీఠంలో శ్రీవారి జపయజ్ఞం

బోట్‌క్లబ్: నవంబర్ రెండో వారంలో శ్రీవారి 58వ జపయజ్ఞం సందర్భంగా ఆళ్వారులతో భోగి గణపతి పీఠంలో వేంకటేశ్వరస్వామి వారి వ్రతపూజ నిర్వహించనున్నట్టు పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు తెలిపారు. శనివారం ఉదయం గణపతి నవరాత్రుల 8వ రోజు సందర్భంగా అష్ట గణపతి వేంకటేశ్వరస్వామి వార్లకు పంచామృత అభిషేకం, సహస్ర గోవింద నామ పారాయణ నిర్వహించారు. 108 జపయజ్ఞాలు పూర్తి చేసి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, తిరుపతి బస్సు యాత్ర నిర్వహించనున్నట్టు రమణరాజు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

18న ఎస్‌జీఎఫ్ఐ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 18న కాకినాడ డీఎస్ఏలో అండర్‌-14, 17 విభాగంలో క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్టు సమాఖ్య కార్యదర్శి ఎల్.జార్జి శనివారం తెలిపారు. ఫుట్‌బాల్ అండర్‌-17 బాలురు, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, సపక్‌తక్రా, జుడో క్రీడాంశాల్లో బాలురు, బాలికల జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ



రమణయ్యపేటలో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న కోరమాండల్ మహిళా క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. రమణయ్యపేటలో ఏపీఐఐసీ కాలనీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రతినెలా మాదిరిగా నిత్యావసర సరకులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త వేదుల శిరీష, అడబాల రత్నప్రసాద్, శ్రీదేవి, లక్ష్మీసృజన, ప్రసాద్, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందీని తప్పనిసరిగా నేర్చుకోవాలి



రమణయ్యపేటలో హిందీ పండిట్ రఘుకు సన్మానం

కాకినాడ రూరల్: హిందీని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నేర్చుకోవాలని హిందీ పండిట్, ఎయిమ్స్ పాఠశాల కరస్పాండెంట్ వీకే రఘు పేర్కొన్నారు. హిందీ భాషా దినోత్సవం సందర్భంగా రమణయ్యపేటలో శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగ సభ హిందీని జాతీయ భాషగా గుర్తిస్తూ తీర్మానించడంతో అప్పటి నుంచి హిందీ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టరు శిరీష, అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, ప్రసాద్ నాయుడు, మీనాక్షి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాద్రపదమాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయ, వినయ్, చెరుకూరి రాంబాబు పూజలు చేశారు.